# కథాకేళి



## హంతకుడు

# మల్లాది వెంకటకృష్ణమూర్తి

"చంపేస్తాను" అని జీవితంలో కోపంగా అనని వ్యక్తి ఈ లోకంలో వుండడు. ప్రతి మనిషికి ఏదో ఓ సందర్భంలో ఎదుటి మనిషిని చంపేయాలన్నంత కోపం వస్తుంది. కాకపోతే ఆ కోపం పోయాక అలా 'చంపుతాను' అన్న సంగతే గుర్తుండక పోవచ్చు. తర్వాత ఆ వ్యక్తిని చంపాలని ఇంకోసారి అనుకోకపోవచ్చు.

కాని నేనలా కాదు. నాకు కోపం వచ్చినప్పుడు 'నిన్ను చంపేస్తాను జాగ్రత్త' అని అందరిలో క్రోధంగా అరవలేదు. అర్జున్ వంక కొద్ది క్షణాలపాటు తీవ్రంగా చూశాను. చూసి అడిగాను.

"అయితే మన పార్ట్‌నర్‌షిప్‌లోని భాగం నాకివ్వదలుచుకోలేదా?"

"లేదు మనిద్దరం పార్ట్‌నర్స్‌గానే కంటిన్యూ అవుదాం" చెప్పాడు అర్జున్.

"నేను పెట్టుబడి, గుడ్‌విల్, లాభంలో భాగం ఇస్తున్నానుగా. ఇంకేమిటి ఇబ్బంది?" అడిగాను.

చిన్నగా నవ్వి చెప్పాడు అర్జున్.

"మనకి తెలుగుగంగ కంట్రాక్ట్ వచ్చిందని నువ్వు నానించి దాచలేవు. దాని వల్ల మన ఫరం లాభాలు ఎంత పెరుగుతాయో నాకు తెలుసు. ఆ కంట్రాక్ట్ అయ్యే దాకా మనిద్దరం పార్ట్‌నర్స్" చెప్పాడు అర్జున్.

అప్పుడు అనిపించింది నాకు అర్జున్‌ని లేపెయ్యాలని. నా కోపాన్ని అతి బలవంతంగా అణుచుకుని చెప్పా–

"అయితే సరే"

అర్జున్‌ని ఎలా చంపాలా అని నాలుగైదు రోజులు తీవ్రంగా ఆలోచించాక అనేక పథకాలు తట్టాయి. కాని ఏదీ నాకు తృప్తిగా అనిపించలేదు. ప్రతిదాంట్లో ఏదో ఓ లోపం వుంది.

చివరికి తట్టిందా అద్భుతమైన పథకం. పోలీసులకి అనుమానం నా మీదకి రాకుండా మరొకరి మీదకి పోయే ఆ పథకం. అది అమలు జరపాలంటే రెండు ప్రాణాలు లేచిపోవాలి. ఒక్కటి కాదు రెండు. డజన్ట్ మేటర్. నర్మద చావు వల్ల ఈ లోకానికెలాంటి నష్టం లేదు.

నర్మద అర్జున్ భార్య. ఓ మొగుడికి తన భార్య మీద అనుమానం కలిగితే ఏం చేస్తాడు? ఆమెను నరికి తను ఆత్మహత్యకి పూనుకుంటాడు. పోలీసులు అలా ఆలోచిస్తే చాలు. నా మీదకి అనుమానం రాకుండా వుంటుంది. నర్మద మంచిదే అయినా మరణించాక చెడ్డ పేరు వచ్చినా ఒకటే, రాకపోయినా ఒకటే.

ముహూర్తం సోమవారం మధ్యాహ్నం ఒకటిన్నరకి పెట్టాను. అర్జున్ తన ఇంటికి భోజనానికి వెళ్ళే సమయం అది.

ఆ రోజు ఒంటిగంటకల్లా అర్జున్ ఇంటికి వెళ్ళి తలుపు తట్టాను. నర్మద నన్ను చూసి తలుపు తీసి ఎలాంటి అనుమానం లేకుండా లోపలకి రమ్మంది. వెళ్ళాను.

ఇంటికి వచ్చి తన భార్య పరాయి పురుషుడితో వుండడం చూసిన వ్యక్తి మానసిక స్థితి ఎలా వుంటుంది? నా జేబులోంచి రివాల్వర్ తీసి అయిదు గుళ్ళు పేల్చాను. ఒకటి నర్మద రెండు కళ్ళ మధ్య నుంచి దూసుకుపోయింది. వెంటనే నేలకూలింది. మిగతావి బెడ్‌రూంలో అక్కడక్కడా తగిలాయి.

వెయిట్ చేశాను. అర్జున్ వచ్చాడు. గదిలోకి వచ్చి నర్మద చచ్చిపడి వుండడం చూసేలోగా అతని కుడి కణతకి ఆనించి రివాల్వర్ పేల్చాను. ఏం జరిగిందో అర్థం అయేలోగా నేలకూలాడు. నా చేతిలోని రివాల్వర్‌ని నా వేలి ముద్రలు పడకుండా తుడిచి అర్జున్ కుడిచేతిలో వుంచి వేళ్ళు మూశాను.

నా ఆఫీసు నుంచి పావుగంట తర్వాత పోలీసులకి ఫోన్ చేసి ఆదుర్దాగా చెప్పాను. అర్జున్ నాకు అప్పుడే ఫోన్ చేసి తన భార్య నర్మదని చంపేశానని, తను ఆత్మహత్య చేసుకోబోతున్నానని చెప్పాడని నేను వారించేలోగా రిసీవర్ పెట్టేసాడని, ధాం అని శబ్దం కూడా వినిపించిందని.

అరగంట తర్వాత అక్కడికి వెళ్ళాను. అతనింటి బయట పోలీసు వేన్ ఆగి వుంది. వాళ్ళ దేహాలని అప్పుడే చూసినట్టుగా చూసి విచారం నటించాను. నా కళ్ళ వెంట నీళ్ళు వచ్చేదాకా నేనెంత గొప్ప నటుణ్ణని నాకే తెలీదు.

"ప్చ్! నర్మద ప్రియుడి గురించి అర్జున్‌కి ఎప్పటికయినా తెలుస్తే ఏమవుతాడు అని అనుకుంటూనే వున్నాను" చెప్పా.

"అసలేం జరిగింది?" అడిగాడు ఇన్‌స్పెక్టర్.

"అరగంట క్రితం అనుకుంటా ఫోన్ మోగింది. ఎత్తితే అర్జున్. తను భోజనానికి ఇంటికి వెళ్ళేసరికి తన భార్య పరాయి మగాడితో గడుపుతూ కనిపించిందని, ఆవేశంతో కాల్చేశానని, పావుగంట సేపు ఆలోచించి తను ఆత్మహత్య చేసుకోవాలని నిశ్చయించుకొని నాకు ఫోన్ చేసి చెప్పాడట. నేను వారించేలోగానే ఫోన్ పెట్టేశాడు. పెట్టేస్తుండగా అనుకుంటా ధాం అని శబ్దం వచ్చింది. వెంటనే మీకు ఫోన్ చేసి బయలుదేరి వస్తున్నాను" చెప్పాను ముందు అనుకున్న విధంగానే.

నర్మద రహస్య ప్రియుడెవరో మీకు తెలుసా అని అడుగుతాడనుకున్నాను. ఊహూ. ఆ ప్రశ్న అడగలేదు. ఇన్‌స్పెక్టర్ చిన్నగా నవ్వి "మీరు కథలు రాస్తుంటారా?" అని అడిగాడు. వెంటనే ఆశ్చర్యంగా తల అడ్డంగా వూపి అడిగాను.

"లేదు. ఎందుకలా అడిగారు?"

"అలా జరగలేదు కాబట్టి. మీరే ఈ ఇద్దర్నీ చంపారు కాబట్టి."

నా పక్కనే బాంబు పేలినట్టుగా ఉలిక్కిపడి అడిగాను.

"వాట్ ఆర్ యు టాకింగ్?"

"తెలుసు. ఓసారి ఈ ఫోన్ లైన్‌ని చూడండి" చెప్పాడు ఇన్‌స్పెక్టర్.

చూశాను.

రెండు బుల్లెట్స్ తగిలి ఫోన్ రిసీవర్ పగిలి పోయి వుంది.

"మీరు చెప్పినట్టుగా నర్మదని అర్జున్ చంపి వుంటే ఆ తర్వాత మీకు అతను ఫోన్ చెయ్యాలన్నా చేసి వుండేవాడు కాదు. ఎందుకు చేశారీ హత్యలు?" అడిగాడు ఇన్‌స్పెక్టర్.

నా నుంచి నిజం రాబట్టడం వాళ్ళకి ఎంతో తేలికని నాకు తెలిసిపోయింది. చెప్పాను ధైర్యంగా "అవును. నేనే చంపాను."

●

